నేడు ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం
● హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 7

అబద్ధాల పునాదులపై మోదీ పాలన
● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు 7

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



ఇటుక బట్టీల వద్ద అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణ

కరీంనగర్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మండలంలోని చామనపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని మొగ్దుంపూర్ ఇటుకబట్టీల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలకు వాక్సినేషన్ చేయించారు. 150 మంది మహిళలకు ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంప్‌ని నిర్వహించారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. ముగ్గురు మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహిళలు రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ సాజిద, పీవో ఎంసీహెచ్ డాక్టర్ సన జవేరియా, చామనపల్లి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అలుగునూరు సీవోఈని తరలించవద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సుభాష్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): అలుగునూరులో ఉన్న స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ)ని తరలించవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సీవోఈ తరలించ డాన్ని, బైపీసీ కోర్సును ఎత్తివేయడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట బుదవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాల విద్యార్థుల చదువులకు తీవ్ర నష్టం ఏర్పడుతుం దని, సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. అల్గు నూరు సీవోఈని తరలించడం వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కరీంనగర్‌లో చదువుతున్న విద్యార్థులను హైదరా బాద్ గౌలిదొడ్డికి పంపిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. గురుకులాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత కార్యదర్శి అలుగు వర్షినికి తెలుపుదామంటే ఆమె అపాయిమెంట్ కూడా ఇవ్వడంలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 గురుకులాలను ఎత్తివేయడం శోచనీయమన్నారు. సీవోఈని, బైపీసీ కోర్సును యథావిధిగా కొనసాగిం చాలని డిమాండ్ చేశారు. లేకపోతే మంత్రి పొన్నం ప్రభాకర్, గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి ఇళ్లను ముట్టిడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, సహాయ కార్యదర్శి ఆకాష్, జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, సన్ని, వరుణ్, మనోజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వానాకాలం సాగు ప్రణాళిక సిద్ధం

- 3,43,240 ఎకరాల్లో పంటల సాగు
- 2,76,500 ఎకరాల్లో వరి, 48 వేల ఎకరాల్లో పత్తి
- వెయ్యి ఎకరాల్లో పప్పు దినుసులు
- కూరగాయలు, ఉద్యానవన సాగు 13,045 ఎకరాలు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన వ్యవసాయశాఖ



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఇప్పటికే రాష్ట్రంలో ప్రవేశించిన నైరుతీ రుతుపవనాలతో జిల్లాలో మూడు, నాలుగు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వానాకాలం సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి పంపించింది. జిల్లాలో ఈ సీజన్‌లో 3,43,240 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ప్రధాన పంట వరిని 2,76,500 ఎకరాల్లో, పత్తిని 48 వేల ఎకరాల్లో, మొక్కజొన్నను నాలుగు వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేసి అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. వెయ్యి ఎకరాల్లో కంది, 200 ఎకరాల్లో పెసర, వెయ్యి ఎకరాల్లో మిర్చి, 150 ఎకరాల్లో వేరుశెనగ, 13,045 ఎకరాల్లో కూరగాయలు, ఇతర హార్టికల్చర్ సాగును చేస్తారని అంచనా వేశారు. 300 ఎకరాల్లో పొగాకు సాగు చేస్తారని భావి స్తున్నారు.

● బీటీ-3 పత్తి విత్తనాలపై నిషేధం

బీటీ-3 పత్తి విత్తనాలను వాడవద్దని, ఈ విత్తనాలను సాగు చేస్తే పర్యావరణం దెబ్బతింటుందని వ్యవసాయశాఖ చెబుతున్నది. దేశంలో ఈ పత్తిని సాగు చేసేందుకు అనుమతి లేదు. బీటీ-3, బీజీ-3 విత్తనాలను హెర్బిసైడ్ టాలరెంట్ విత్తనాలుగా పేర్కొంటారు. ఈ విత్తనాలు గ్లైఫోసిన్ కలుపు మందును తట్టుకుని ఉండేలా జన్యుమార్పిడి చేసిన రకాలకు చెందినవి. ఈ విత్తనాలను సాగు చేస్తే కలుపు మందు కొట్టినా మొక్క చనిపోదని అందుకోసమే రైతులు దీన్ని సాగుచేసి అవసరానికి మించిన కలుపు మందును కొడతారు. దీంతో పర్యావరణం, జీవవైవిధ్యం దెబ్బతింటుందని వ్యవసాయశాఖ చెబుతుంది. ఈ విత్తనాల సాగుతో పత్తి మొక్క, కలుపు మొక్కల మధ్య క్రాసింగ్ జరిగి కలుపు మందును తట్టుకునే జన్యువులు కలుపు మొక్కలోకి ప్రవేశించే అవకాశం ఉంటుందని దాంతో అది సూపర్‌వీడ్‌గా మారే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

● ఎరువులు, విత్తనాలకు ఏర్పాట్లు

3,43,240 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసే రైతన్నలు అధిక ఉత్పత్తి సాధించడానికి ఈ పంటల కోసం 43,254 మెట్రిక్ టన్నుల యూరియా, 26,957 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 7,730 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 6,945 మెట్రిక్ టన్నుల డీఏపీ వినియోగిస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేశారు. అందుకు అనుగుణంగా స్టాక్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. 69,125 క్వింటాళ్ల వరి విత్తనాలు, 320 క్వింటాళ్ల మొక్కజొన్న, 30 క్వింటాళ్ల కందులు, 16 క్వింటాళ్ల పెసర, 90 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు, 88,162 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయని అంచనావేసింది. ఈ మేరకు వాటిని అందుబాటులో ఉంచేందుకు అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 16,809 మెట్రిక్ టన్నుల యూరియా, 31,076 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 2,593 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,836 మెట్రిక్ టన్నుల ఎంవోపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అవసరాన్నిబట్టి ఎప్పటిక ప్పుడు ప్రభుత్వం నుంచి ఎరువులు తెప్పించేందుకు జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రధానంగా ప్రతి యేటా పత్తి విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీనిని ఆసరా చేసుకుని వ్యాపారులు ఆ విత్తనాలను బ్లాక్

(మిగతా 8వ పేజీలో)

దుర్శేడ్ గ్రామాన్ని సందర్శించిన మున్సిపల్ అధికారులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కరీంనగర్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని దుర్శేడ్‌లో సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు ఎట కేలకు కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఇటీవల గ్రామంలో స్మశాన వాటిక సమస్యలపై, మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి నీరు చేరడంతో గ్రామస్థులు పడిన ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. బుధవారం ఉదయం కరీంనగర్ మున్సిపల్ శానిటేషన్ ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్ రెడ్డి, వార్డు ఆఫీసర్ మణిదీప్ గ్రామానికి చేరుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీరు నిలిచిన ప్రాంతాన్నిఔ, శ్మశాన వాటిక సమీపంలోని డ్రైనేజీలను పరిశీలించారు. శ్మశాన వాటికలో గడ్డిని తొలగించారు. పైప్ లైన్ లీకేజీలు, విద్యుత్ దీపాల గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు

షూటింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ స్పోర్ట్స్, మే 28 (ఆంధ్రజ్యోతి): రైఫిల్ షూటింగ్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో బుధవారం సాయంత్రం రైఫిల్ షూటింగ్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పెద్దపల్లి జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి సురేష్‌తో కలిసి రైఫిల్ షూటింగ్ చేశారు. కార్యక్రమంలో రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంగపల్లి రాజేందర్‌రావు, ప్రసాద్, కడారి రవి పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను నియంత్రించాలి



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ గౌస్ ఆలం

చొప్పదండి, మే 28 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. మండలంలోని ఆర్నకొండ పోలీస్ చెక్‌పోస్టును ఆయన బుధవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రివేళల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రతి గూడ్స్ వెహికిల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అక్రమంగా పశువుల రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, విధులను నిర్వర్తించేటప్పుడు వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ చెక్‌పోస్టును అక్రమ పశువుల రవాణా నివారణకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్ఐ మామిడాల సురేందర్, ప్రొబేషనరీ ఎస్ఐ మనీషా, సిబ్బంది పాల్గొన్నారు.

సీలింగ్ భూముల రిజిస్ట్రేషన్లు అక్రమం

- కొత్తపల్లి 175,197,198 సర్వే నంబర్ల రిజిస్ట్రేషన్లు రద్దు
- కలెక్టర్ ఆదేశాలతో చర్యలు చేపట్టిన కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్



గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేలి ముద్రలు వేస్తున్న ఆర్డీవో

గంగాధర, మే 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి హావేళి సీలింగ్ భూముల రిజిస్ట్రేషన్లు అక్రమమేనని, కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని రద్దు చేస్తున్నట్లు ఆర్డీవో మహేశ్వర్ తెలిపారు. బుధవారం గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు ప్రకియను ఆర్డీవో మహేశ్వర్, డీఆర్వో ప్రవీన్‌కుమార్ చేపట్టారు. రిజిస్ట్రేషన్ల రద్దుకు కొత్తపల్లి ఆర్ఐ మహ్మద్ నదీం, కరీంనగర్ డీటీ కిరణ్‌కుమార్‌ను సాక్షులుగా ఉంచి ఆర్డీవో మహేశ్వర్ చర్యల చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి శివారులో సర్వే నంబరు 175, 197, 198 సీలింగ్ భూమిలో 476 అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. ఈ డాక్యుమెంట్ల రద్దుకు కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చే శారు. గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ల రద్దుకు బుధవారం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేర కు వేలి ముద్ర, ఫేస్ రీడింగ్‌తో తనతోపాటు కొత్తపల్లి ఆర్ఐ మహ్మద్ నదీం, కరీంనగర్ డీటీ కిరణ్‌కుమార్ రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. 476 డాక్యుమెంట్ల రద్దుకు సమయం పడుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గంగాధర సబ్ రిజిస్ట్రార్ నూర్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవో అనుచిత వ్యాఖ్యలపై కలెక్టర్ సీరియస్

- ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదుతో చర్యలు
- ప్రభుత్వానికి సరెండర్
- పలుసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు

కరీంనగర్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): మొదటి నుంచి వివాదాస్పద అధికారిగా పేరున్న జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావుపై ఎట్టకేలకు వేటు పడింది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ సంఘాల శిక్షణ కార్యక్రమంలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలపై మహిళా ఉపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఐదేళ్లుగా అనేక డీఈవోపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్‌తోపాటు విద్యాశాఖ ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా చేసిన అనుచిత వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్ డీఈవో జనార్దన్‌రావును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారి చేశారు. ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారిగా డైట్ ప్రిన్సిపాల్ మొగిలయ్యను నియమిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

● ఆది నుంచీ వివాదాస్పదుడే..

జిల్లా విద్యాశాఖ అధికారి 2020 నుంచి ఇప్పటి వరకు అనేకసార్లు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలపై నోరు జారడమే కాకుండా అనుచిత వ్యాఖలు చేశారనే ఆరోపణలున్నాయి. తాజాగా చేసిన వాఖ్యలపై కలెక్టర్ స్పందించి సరెండర్ చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన స్కూళ్ల విజిట్‌కు వెళ్లిన సందర్భంలో విద్యార్థులతో పుష్ప సినిమాలోని వచ్చేస్తున్నా ఫీలింగ్స్ లాంటి మాటలు మాట్లాడారని ఆరోపణలు ఉన్నాయి. ఆయన కార్యాలయంలోకి వెళ్లాలంటే చెప్పులు విడిచి రావాలనే నిబంధన పెట్టడంతో విమర్శలు వచ్చాయి. డీఈవో వివాదాస్పద వ్యాఖ్యలపై కొందరు మహిళా హెచ్ఎంలు కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.




● వంట రాకపోతే మీ ఆవిడ లేచి పోతుందని పిల్లలకు చెప్పండి

కొత్తపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమం ఈనెల 24న జరిగింది. కార్యక్రమానికి హజరైన డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆడ లేదు.. మగా లేదు.. అందరికి వంట రావాలి రావాల్సిందే.. భవిష్యత్‌లో మీ పిల్లలందరికి చెప్పండి.. ముఖ్యంగా అబ్బాయిలకు చెప్పండి. వంట రాకపోతే మీ ఆవిడ ఉండదురా బాబు. లేచిపోతుందని అని చెప్పుకొచ్చారు. వంట వచ్చినా అలిగి చేస్తే అది చెడిపోతుందని, మనకు చదువు వచ్చి కూడా సరిగా చెప్పకపోతే అదే పరిస్థితి ఎదురవుతుందన్నారు. దీంతో అక్కడ ఉన్న డీటీఎఫ్ నాయకుడితోపాటు కొందరు మహిళా ఉపాధ్యాయులు

(మిగతా 8వ పేజీలో)

ఇన్‌చార్జి డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన మొండయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ ఎస్ మొండయ్య

కరీంనగర్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ మొండయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఈవోగా పనిచేసిన జనార్ధన్‌రావును కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆయన స్థానంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ మొండయ్యకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో లారీ క్లీనర్ మృతి

కరీంనగర్ క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంబడిపూడి ఏడుకొండలు(50) అనే లారీ క్లీనర్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. కరీంనగర్ త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుజిల్లా బల్లపర్ల మండలం వెల్లటూరుకు చెందిన ఏడుకొండలు కొంతకాలంగా లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న లారీలో వినుకొండ నుంచి కర్రలోడ్ కోసం మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు వెళ్లాడు. చంద్రాపూర్‌లో కర్ర లోడ్‌తో తిరిగి వస్తుండగా మంగళవారం మధ్యాహ్నం కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ఛాతిలో నొప్పివస్తున్నదని చెప్పిన ఏడుకొండలు లారీలోనే కుప్పకూలాడు. లారీ డ్రైవర్ వెంటనే ఏడుకొండలును 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఏడుకొండలు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జగిత్యాలరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల పవిత్ర (31) అనే వివాహిత చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మమత కొన్ని రోజులుగా అనారోగ్యతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే ఈనెల 23న ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం బంధువులు జగిత్యాల లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి భర్త రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

రాయికల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన సిరిపురం శ్రీహరి (47) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సిరిపురం అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



సమ్మయ్య(ఫైల్)

ముత్తారం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన కోట సమ్మయ్య అనే వ్యక్తి అదృశ్యం కాగా ఆయన కుమారుడు కోటా అజయ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడని ఎస్సై భూపతి నరేష్ తెలిపారు. ఈనెల 26న ఇంట్లో భార్యాభర్తలకు గొడవ జరగగా గౌడవృత్తి చేసుకునే సమ్మయ్య తాటి చెట్టు ఎక్కివస్తానని సామాను తీసు కొని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. రెండు రోజులుగా వెతుకగా మంథని బస్టాండ్‌లో భూపాలపల్లి వైపువెళ్లే బస్సు ఎక్కుతున్నట్లు సమా చారం అందిందని బాధితుడి కుమారుడు అజయ్ ఫిర్యాదులో పేర్కొ న్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సారంగాపూర్, మే, 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సారంగాపూర్ ఎస్సై దత్తాద్రి తెలిపారు. జగిత్యాల మండలం తారకరామ్ నగర్‌కు చెందిన షేక్ రఫీక్(25) అనే వ్యక్తి ఆదిలాబాద్ జిల్లా కంబూడ గ్రామానికి చెందిన మార్వతి కాక వద్ద 1035 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశాడన్నారు. అనంతరం జగిత్యాల తరలిస్తుండగా సారంగాపూర్ మండలం పోతారం చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయి, ద్విచక్రవాహనం, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై దత్తాద్రి పేర్కొన్నారు.

ఊడిన చిల్డ్రన్స్ అవేర్‌నెస్ పార్క్ గేటు



తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఊడిన చిల్డ్రన్స్ అవేర్‌నెస్ పార్క్ గేటు

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోని రోడ్డు సెఫ్టీ చిల్డ్రన్ అవేర్‌నెస్ పార్క్ గేటు ఈ మధ్యలో వచ్చిన గాలి దూమారానికి ఊడిపోయింది. దాన్ని తిరిగి బిగిం చేందుకు అధికారులు అలసత్వం వహిస్తున్నారని కార్యాలయానికి వచ్చే వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు గేటును నాణ్యత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు.

ఎన్‌ఎఫ్‌బీఎస్ వితంతువులకు భరోసా

కుటుంబ పెద్ద మరణిస్తే రూ.20వేల ఆర్థిక సహాయం



చొప్పదండి, మే 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్ద మరణిస్తే 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్దేశించిన ఎన్ ఎఫ్‌బీఎస్ పథకం మళ్లీ ప్రారంభమయింది. ప్రమాదవశాత్తు లేదా ఏదైనా అనారోగ్య కారణాలతో ఇంటి పెద్ద మరణిస్తే 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం జాతీయకుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్)ను ప్రవేశపెట్టింది. వితంతువులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూపొందించిన ఈ పథకం కోవిడ్ సంక్షోభ సమయంలో నిలిచి పోయింది.

ఇటీవల ఈ పథకం తిరిగి ప్రారంభం కాగా అర్హుల నుంచి రెవెన్యూ, ఐకేపీ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వితంతువుల జాబితాను విచారణ జరిపి అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు కసరత్తును ప్రారంభించారు. కాగా అర్హులు దారిద్ర్యరేఖకు దిగువ కుటుంబానికి చెంది ఉండాలి. కుటుంబ పెద్ద మరణించిన రెండేళ్లలోపు వారు అర్హులు. వితంతువులు తమ దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలి.

దరఖాస్తుతో వితంతువు ఆధార్ కార్డు, కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు, భర్త మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు ఫొటో, ఐకేపీ అధికారి నుంచి ఎన్‌వోసీ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ను జతచేసి దరఖాస్తును అందజేయాలి. 59ఏళ్లకు పైబడిన వితంతువులు ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు, దళితబంధు, రైతుబీమా, గీత కార్మిక నష్టపరిహారం అందుకున్న కుటుంబాలు, బాధిత కుటుంబాల పథకం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలు ఈ పథకానికి అనర్హులు.

ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడిపై దాడి

ఇల్లందకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య గొడవ పరస్పర దాడికి దారి తీసింది. పోలీసులు, ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు అన్వేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు మూడ్రోజులుగా హుజూరాబాద్ లీడర్స్ వాట్సాప్‌గ్రూప్‌లో ఇల్లందకుంట ఎన్‌ఎస్ యూఐ మండలాధ్యక్షుడు అన్వేష్ ఇదే మండలానికి చెందిన సామల రాజిరెడ్డి పరస్పరం చాటింగ్ చేసుకున్నారు. కాంగ్రెస్‌పార్టీలో మేము సీనియర్స్ అంటూ.. మేము లేకుంటే కాంగ్రెస్‌పార్టీ లేదంటూ చాటింగ్ చేసుకున్నారు. ఇద్దరిది ఇల్లందకుంట మండలం కావడంతో బుధవారం చూసుకుందామని సాయంత్రం రాజిరెడ్డి అన్వేష్‌కు ఫోన్‌చేయగా అక్కడికి చేరుకున్న అన్వేష్‌పై రాజిరెడ్డితో పాటు మరోఇద్దరు దాడిచేశారు. దీంతో అన్వేష్‌కు గాయాలు కాగా జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసులను వివరణ కోరగా ఇద్దరు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

భక్తులపై తేనెటీగల దాడి

మల్లాపూర్, మే, 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లివెంకట్రావ్‌పేట శివారులోని లింగాలరేవు వద్దకు బుధవారం మొక్కులు తీర్చుకొనేందుకు వచ్చిన పలువురు భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి ప్రతి బుధవారం, శుక్రవారం అధికసంఖ్యలో వస్తుంటారు. బుధవారంభక్తులు మొక్కులు చెల్లిస్తుండగా తేనెటీగలు దాడి చేయడంతో పలువురికిస్వల్ప గాయాలయ్యాయి.

గోదావరిఖనిలో క్షుద్రపూజల కలకలం

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిబీకాలనీ రాజీవ్‌రహదారి సర్వీస్ రోడ్డు పైగల మైసమ్మగుడి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేశారనే ప్రచారంపై స్థానికులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం స్థానికులు దీనిని గమనించారు. ఇద్దరి ఫొటోలతో నిమ్మకాయలు, జీడిగింజలు, ఇతర సామగ్రి పెట్టి క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. సమీపంలోని సీసీకెమెరాలను పరిశీలించగా ఒకవ్యక్తి బైక్‌పై వచ్చి అక్కడపెట్టినట్లు గుర్తించారు. బైక్‌నెంబర్ ఆధారంగా మంచిర్యాలజిల్లాకు చెందిన అతడిగా గుర్తించారు.

కళ్లలో కనపడుతున్నావు పెద్దనాన్న..

● నువ్వు వస్తావని ఎదురు చూస్తున్నా

● మావోయిస్టు నేత తిరుపతి తమ్ముడి కూతురు బహిరంగ లేఖ



తిరుపతి(ఫైల్)

కోరుట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): "కళ్లలో కనపడుతున్నావు పెద్దనాన్న... ఇంకా నువ్వు వస్తావని ఇంటి గుమ్మం వద్ద కుటుంబసభ్యులం ఎదురు చూస్తున్నాం.. ఎక్కడ ఉన్నా లొంగిపోవాలి.. నువ్వు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నా.." అంటూ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి తమ్ముడి కూతురు సుమ బహిరంగ లేఖ విడుదల చేసింది. ఆపరేషన్ కగార్‌తో వస్తున్న వార్తలను చూసి నీ కోసం కుటుంబం అంతా ఆందోళన చెందుతోందని లేఖలో పేర్కొంది.

కోరుట్ల పట్టణానికి చెందిన తిపిరి గంగమ్మ- వెంకటనర్సయ్య దంపతులకు ఒక కూతురు లీల, ముగ్గురు కుమారులు వెంకటి, తిరుపతి, గంగాధర్ ఉన్నారు. వీరిలో తిరుపతి 18 ఏళ్ల వయసులోనే 1984లో నక్సలిజం వైపు ఆకర్షితుడై అజ్ఞాతంలోకి వెళ్లాడు. అప్పటినుంచి మావోయిస్టు అగ్రనేతగా ఎదిగి అజ్ఞాతంలో ఉంటున్నాడు. అతని అన్న వెంకటి ప్రమాదవశాత్తు మృతిచెందగా తమ్ముడు తిప్పిరి గంగాధర్ కోరుట్లలో నివాసం ఉంటున్నాడు. గంగాధర్ కూతురు సుమ పెదనాన్న కోసం లేఖ రాసింది. నిన్ను చూడాలని ఉందని, ఉద్యమం వదిలి ఇంటికి రావాలని లేఖలో మావోయిస్టు నేత తిరుపతిని సుమ కోరింది.

ఆటో చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



దొంగను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో నిలిపి ఉన్న ఆటోను దొంగతనం చేసిన జిలకర ప్రసాద్‌ను అనేవ్యక్తిని జగిత్యాలటౌన్ పోలీసులు బుధవారం అరెస్టుచేశారు. టౌన్‌సీఐ వేణుగోపాల్ బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం నిర్మల్‌జిల్లా దుస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామానికిచెందిన మగ్గిడి కృష్ణ అనే వ్యక్తి ఈనెల 26న జగిత్యాల జిల్లా కేంద్రంలోని కోర్టుఆవరణలో తనఆటోను పార్కింగ్ చేశాడు. కోర్టు సమీపంలో తన పనులు ముగించుకుని తిరిగి వచ్చేసరికి ఆటో కనబడకపోవడంతో పట్టణపోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయంజిల్లా కేంద్రంలోని గాంధీనగర్ పాంత్రంలో పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీచేస్తున్న సమయంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన జిలకర ప్రసాద్ ఆటోను అతివేగంగా నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో జిలకర ప్రసాద్‌ను ఆటో దొంగగా గుర్తించి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై గీత తదితరులు ఉన్నారు.

పుస్తెల తాడు చోరీ

సుల్తానాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన మామిడి పండ్లు అమ్ముకుంటున్న మహిళవద్దకు వచ్చిన ఇద్దరు అగంతకులు ఒకరు పండ్లు బేరమాడు తుండగా మరోవ్యక్తి మహిళ మెడలోని పుస్తెల తాడును లాక్కోని పారిపోయిన ఘటన బుధవారం వెలుగుచూసింది. మండలంలోని నీరుకుళ్ల గ్రామానికిచెందిన రమ్య నీరుకుళ్ల శివారులోని మామిడితోటవద్ద మామిడిపండ్లు విక్రయిస్తోంది. బుధవారం ఇద్దరు బైక్‌పైవచ్చి ఒకరేమో పండ్లు బేరమాడుతుండగా మరొకరు అదునుచూసి మహిళమెడలోని పుస్తెల తాడు లాక్కోని బైక్‌పై పారిపోయారు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ట్రైనీ ఎస్సైకి నోటీసులు

హుజూరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయకమిషన్ నోటీసులు జారీ చేసిందని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జీ టి సంపత్ అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15రోజుల క్రితం మండలంలో ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మహేందర్ అనే వ్యక్తిని రెండుచెవుల కర్ణబేరిలు పగిలిపోయేలా కొట్టాడన్నారు. దీనిపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర జాతీయ ఎస్సీకమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై స్పందించిన మానవ హక్కుల కమిషనర్ కరీంనగర్ సీపీ, అడిషనల్ లాఅండ్‌ఆర్డర్‌కు నోటీసులు జారీచేసిందన్నారు. ప్రజలకు పోలీసులపై విశ్వాసం ఉండాలంటే, నిజానిజాలు తెలవాలంటే ఎస్‌ఐ భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రవితేజ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

● బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్‌నేత

పెద్దపల్లి కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్‌నేత అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్య నాహక్కు. బాలకార్మిక వ్యవస్థను అంతంచేద్దాం అనే నినాదంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధి చెందాలంటే నేటిబాలలే భావిభారత పౌరులుగా తయారు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలకార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. బాలలకు స్వేచ్ఛగా ఉండే వాతావరణాన్ని కల్పించాలని, ప్రతీ చిన్న విషయంలో పిల్లలను మందలించవద్దన్నారు. బాలలు బడిలో ఉండాలని పనిలో ఉంటే నేరమన్నారు. బాలకార్మికులచే పని చేయించుకుంటే కఠినమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా మనమంతా కృషిచేద్దామని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తల్లిదండ్రులు ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. భావితరం బాలలప్రగతికోసం పునాదులు వేద్దామన్నారు. బాలకార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు



నుస్తులాపూర్‌లోని మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): నుస్తులాపూర్‌లోని పలు విత్తన, ఎరువు, పురుగు మందుల దుకాణాల్లో తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్ఎండీ ఎస్సై వివేక్, ట్రైనీఎస్సై శ్రీకాంత్‌తో కలిసి మండల వ్యవసాయధికారి సురేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా అధీకృతడీలర్ వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. రసీదులు తప్పక తీసుకొని పంటకాలం వరకు వాటిని భద్రపరుచుకోవాలని సూచించారు.

పారిశుధ్య కార్మికుడికి పాముకాటు

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుడు చంద్రగిరి భూమయ్య (55) బుధవారం పాముకాటుకు గురయ్యాడు. గోదావరిఖని గాంధీనగర్‌లోని ప్రధాన నాలాలో పూడిక పేరుకుపోయి చెట్లు పొదలు పెరగడంతో పారిశుధ్య కార్మికుడు చంద్రయ్య వాటిని తొలగించేందుకు డ్రైన్‌లోకి దిగాడు. పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా పాము చేయిపై కాటు వేసింది. అతడిని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు.

మృతదేహాలు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధం

● మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

● పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ డిమాండ్



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

పెద్దపల్లిటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధమని పౌరహక్కుల సంఘం, ప్రజాఫ్రంట్ నాయకులు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ జిల్లాకేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద పౌరహక్కుల సంఘం ఉమ్మడికరీంనగర్ జిల్లా కమిటీఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల21న నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాల అప్పగింతపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం అక్కడిపోలీస్‌వర్గాలు కుటుంబ సభ్యులకు మృతదేహాలనుఇవ్వలేదని, నాలుగు రోజులు ఇబ్బందులకు గురిచేస్తూచివరకు పోలీసులే దహన సంస్కారాలు చేశారన్నారు. కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులుమావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు, సహచరుల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. మావోయిస్టుపార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాలకేశవరావు, సహచర సభ్యుల బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీచే న్యాయ విచారణ జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో కేంద్రప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్‌చేశారు.

పౌరహక్కుల సంఘం రాష్ట్రసహాయ కార్యదర్శి మాధన కుమార స్వామి, ఉమ్మడి కరీంనగర్‌జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బొంకురిలక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడి కొమురయ్య, పులిపాక రవీందర్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, దళిత లిబరేషన్‌ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్వాడీ సుదర్శన్, అశోక్, మోదుంపల్లి శ్రవణ్, ఆంజనేయ శర్మ, సుచరిత, పర్వతాలు, సత్యనారాయణ, బండి శంకర్ పాల్గొన్నారు.

జనావాసాల మధ్య పేలుళ్లు

● ఆందోళన చెందుతున్న స్థానికులు



ఇళ్లకు సమీపంలో ఓ బావి వద్ద చేపడుతున్న పూడికతీత పనులు

గన్నేరువరం, మే 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న వేళ రైతులు వ్యవసాయబావుల్లో పూడికతీత పనులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ, పద్మశాలికాలనీ నుంచి వ్యవసాయక్షేత్రాలకు వెళ్లేమార్గంలో ఉన్న బావుల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయి. బావి అడుగున బండరాళ్లు అడ్డురావడంతో పేలుడు పదార్థాలైన జిలిటెన్ స్టిక్స్‌లను వినియోగిస్తున్నారు. వీటివినియోగంపై స్థానికులకు సమాచారం ఇవ్వకపోవడంతో పేలుడు శబ్దాలతో వారంతా భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ సమీపంలోనే పేలుళ్లు జరిగాయి. ఎలాంటి అనుమతులు, సమాచారం లేకుండా పేలుళ్లు జరపడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పేలుడు పదార్థాలు వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ పేలుళ్లు జరగడం గమనార్హం.

హోటల్‌ను సీజ్ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్



జగిత్యాలలో హోటల్‌ను సీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

జగిత్యాల అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల శివసాయి హోటల్‌ను బుధవారం జగిత్యాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష సీజ్ చేశారు. హోటల్‌లో టిఫిన్ తిని కొద్దిరోజుల వ్యవధిలోనే ఫుడ్ పాయిజన్ అయి పలువురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో బుధవారం జగిత్యాల ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం హోటల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. మేడిపల్లి మండలానికి చెందిన ఓవ్యక్తి తన కుమారుడితో కలిసి ఈ నెల 21న ఇదే హోటల్‌లో టిఫిన్‌చేయగా వాంతులు అయ్యాయి. జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు బాధితుడు తెలిపాడు. ఈ నెల 22న మేడిపల్లి మండలం కాసారం గ్రామానికి చెందిన ఓ గర్భిణి ఇక్కడ టిఫిన్ చేయగా తీవ్ర అస్వస్థతకు గురైనట్లు ఆమెసోదరుడు తెలిపారు. మంగళ వారం బుగ్గారం మండల కేంద్రానికి చెందిన బిసవేని వినోద్ గౌడ్‌తోపాటు అతడి అక్కపిల్లలు, తల్లి తీవ్రఅస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. సంపాదనే ధ్యేయంగా వినియోగదారుల ప్రాణాలను లెక్కచేయ కుండా వ్యాపారాలు చేస్తున్న టిఫిన్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వినోద్ జిల్లాఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశాడు.

భవనంపై హోర్డింగ్ బిగిస్తుండగా ప్రమాదం

● హెచ్‌టీ లైన్ తగిలి కార్మికుడికి తీవ్రగాయాలు



గాయపడిన తిరుపతి

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీ జంక్షన్ వద్ద భవనంపై అడ్వర్టయిజ్‌మెంట్ హోర్డింగ్ బిగిస్తుండగా కార్మికుడికి ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్ తగిలింది. ఒక రెస్టారెంట్‌కు సంబంధించి డిజిటల్ బోర్డు బిగించేందుకు సామగ్రి భవనంపైకి ఎక్కిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన తిరుమల్(53) అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అతనికి తీవ్ర గాయాలయ్యాయని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగానే ఉంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం ఇదే విధంగా హై టెన్షన్ లైన్ల కింద ఫ్లెక్సీ బిగిస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి ఒక కార్మికుడు మృతి చెందాడు. మళ్లీ ఇదే తరహా ప్రమాదం చోటు చేసుకుంది.

నేడు ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం...

హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గురువారం సమీక్షా సమావేశం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరుగనుంది. సమీక్షా సమావేశానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్ రావులతోపాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొంటారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉదయం 9 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 9:50కి కరీంనగర్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

ఎస్సారార్ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ అటనామస్ కళాశాల పీజీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్ కుమార్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాలలో 11 పీజీ కోర్సులు నిర్వహిస్తున్నట్లు, వాటి ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ మొదటి సెమిస్టర్‌లో 261 మంది విద్యార్థులకు 226 మంది(87శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పీజీ మూడో సెమిస్టర్‌లో 242 మందికి 222 (92 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు, వెబ్‌సైట్లో ఫలితాలను పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు కరుణాకర్, డాక్టర్ మల్లారెడ్డి, అకాడమిక్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.



జగిత్యాల గోదాంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు

వెల్గటూర్ ఎమ్మార్సీలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..

- మండల పాయింట్లకు సరఫరా షురూ
- జూన్12లోగా పాఠశాలలకు పంపిణీకి చర్యలు

వెల్గటూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసేందుకు పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బడులు తెరిచే నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలు అందించేలా విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. పాఠ్యపుస్తకాలు జిల్లాకు, అక్కడి నుంచి మండల పాయింట్లకు చేరు కుంటు న్నాయి. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్పటి వరకు అన్ని తరగతు లకు సంబంధించిన పుస్తకాలు అందించేలా చర్యలు చేపడుతామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

విడుదల కాని రవాణా చార్జీలు

జగిత్యాల జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 85,368 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాకు 3,80,760 పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు 3,52,000 పుస్తకాలు గోదాంకు చేరుకున్నాయి. ఇంకా 28,760 పుస్తకాలు రావాల్సి ఉంది. గతంలో ఉన్నత తరగతులకు నోట్ బుక్స్ పంపిణీ చేయగా, ప్రభుత్వం ఈసారి ప్రాథమిక తరగతులకు సైతం నోట్ బుక్స్ పంపిణీ చేయాలని నిర్ణయించింది. జిల్లా కేంద్రంలో భద్రపర్చిన పుస్తకాలను ప్రస్తుతం ఆయా మండలాల ఎమ్మార్సీలకు పంపిణీ చేస్తున్నారు. అక్కడి నుంచి ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా స్కూల్ పాయింట్లకు చేరవేస్తున్నారు. కాగా పాఠ్య పుస్తకాల ట్రాన్స్‌పోర్ట్‌కు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని అధికారులు చెబుతున్నారు. ఎంఈఓలు ఈ చార్జీలు భరిస్తున్నట్లుగా తెలుస్తోంది. నిధులు వచ్చిన తర్వాత వారికి బిల్లులు అందించనున్నట్లు సమాచారం.

పంపిణీకి సిద్ధంగా బైలింగ్వల్ పార్టు-1 పుస్తకాలు

ప్రస్తుతం పాఠశాలల పునః ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చేర్పించాలనే ధోరణి ఏర్పడడంతో ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యపుస్తకాల్లో (బై లింగ్వల్) ఒక పేజీలో తెలుగు, మరొక పేజీలో ఇంగ్లీష్‌లో పాఠాలను ముద్రించారు. ఈ క్రమంలో పాఠ్య పుస్తకాలను పార్టు-1, పార్టు-2 గా విభజించి విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రస్తుతం పార్టు-1 పుస్తకాలు జిల్లాకు చేరుకోగా, పార్టు-2 పుస్తకాలు సెప్టెంబర్ వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని విభజించడం ద్వారా విద్యార్థులకు పుస్తకాల బరువు కూడా తగ్గింది.

పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించాం

ద్రోణం రాజు వెంకట రామకృష్ణ, పాఠ్య పుస్తకాల జిల్లా మేనేజర్, జగిత్యాల



జిల్లా గోదాం నుంచి మండల పాయింట్లకు పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించాం. జిల్లాకు 92 శాతం పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఇప్పటికే 16 మండలాలకు పుస్తకాలు పంపిణీ చేశాం. బడిబాట కార్యక్రమానికి ముందుగానే పుస్తకాలు చేరవేసే విధంగా చర్యలు చేపడుతున్నాం.

డిగ్రీ పరీక్షల్లో 34 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాల్‌ప్రాక్టీస్ చేసిన 34 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. నాలుగో సెమిస్టర్‌లో తొమ్మిది మంది, ఆరో సెమిస్టర్ 25 మంది డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాల కేంద్రంలో 13 మంది, శివాని నలుగురు, అపూర్వలో ఇద్దరు, ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఒకరు, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, చాణక్య డిగ్రీ కళాశాలలో ఒకరు, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకరు, శ్రీ శివానిలో ఒకరు, మెట్‌పల్లి జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో ఒకరు, గోదావరిఖని ప్రభుత్వం డిగ్రీ కళా శాలలో ఒకరు, పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ కళాశాల ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఒకరు, కోరుట్ల ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఒకరు, జగిత్యాల ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు ఉన్నట్లు వివరించారు.

రాజన్న ఆలయం మూసివేత వదంతులు నమ్మొద్దు

వేములవాడ కల్చరల్ మే 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని జూన్ 15వ తేదీ నుంచి మూసి వేస్తున్న ట్టు ఆలయ ఈవో పేరుతో ఓ తప్పుడు లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నదని, అలాంటి వదంతులను ప్రజలు నమ్మవద్దని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయంలో ఆలయాన్ని మూసివేస్తున్నట్టుగా ఎలాంటి లేఖను విడుదల చేయలేదని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖకు రాజన్న ఆలయానికి ఎలాంటి సంబంధం లేదని, ఆలయంలో దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న నర్సింగోజు శ్రీనివాస్

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచే విషయంలో ప్రభుత్వం ఇంతవరకు క్లారిటీ ఇవ్వలేదన్నారు. ఒక్కోసారి ఒక్కో రకమైన ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకసారి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతున్నట్లు ప్రకటిస్తున్నారని, మరోసారి పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామంటున్నారని అన్నారు. పార్టీ పరంగా ఇస్తే అన్యాయం జరుగుతుందని, రిజర్వేషన్లు పెంచుతూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.

12 నెల క్రితం నిర్వహించాల్సిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్లతో వాయిదా పడుతున్నాయన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల విషయం పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. పరిష్కారం కాకుండా ఎన్నికలకు వెళ్లడం న్యాయం కాదని, ప్రతిపక్ష పార్టీలు బీసీ రిజర్వేషన్లు విషయంలో తమ వైఖరి ప్రకటించాలని కోరారు. బీసీ రిజ ర్వేషన్లు 20 శాతం నుంచి 42 శాతం అసెంబ్లీలో చట్టం చేశారని, దాని ప్రకారం ఇంత వరకు ప్రభుత్వం జీవో జారీ కాలేదని అన్నారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, కేంద్రంపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి లింగం పల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అబద్ధాల పునాదులపై మోదీ పాలన

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సీపీఐ మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, మే 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అబద్ధాల పునాదులపై పాలన సాగిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ మహాసభల సందర్భంగా ప్రతి నిధుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో సమస్యలను గాలికి వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉద్యోగ, ఉపాధి, తిండి వంటి ఎన్నో కష్టాలను పేదలు అనుభవిస్తున్నార్నారు. దేశంలో ఆదాయం రెట్టింపు అయ్యిందని అబద్ధాలు చెబుతూ దేశాన్ని అప్పుల పాలు చేశారన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేస్తున్నారన్నారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బలహీన వర్గాలపై ముప్పేట చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. అర్హులకు ఇవ్వకుండా ఇష్టారీతిన నిబంధనలు పెట్టడం న్యాయం కాదన్నారు. స్థానిక ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలన్నారు. అంతకుముందు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన పార్టీ కార్య క్రమాల వివరాలను కార్యదర్శి నివేదికను సభలో ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మచ్చ రమేష్, కిన్నెర మల్లవ్వలు, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, పొనగంటి కేదారి, బోయిని అశోక్, కొయ్యడ సృజన్‌కుమార్, అందెస్వామి, బత్తుల బాబు, గూడెం లక్ష్మి పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్



సీపీఐ జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నగరంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 123వ మహాసభలు ముగింపు సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్‌లు హాజరయ్యారు. జిల్ల మహా సభలో నూతన కార్యవర్గం, కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించారు. 14 మంది కార్యవర్గం ఏర్పాటు కాగా, 35 మందితో కౌన్సిల్, ఐదుగురు క్యాండిడేట్ సభ్యులు, నలుగురు ఆహ్వానితులను ఎన్నుకున్నారు.



విద్యుత్ సమస్యల పరిష్కారానికి వాట్సాప్ చాట్‌బాట్

టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా కూడా తమ సమస్యలను తెలుపవచ్చని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ మొబైల్ నుంచి వాట్సప్‌లో 7901628348 నంబర్‌కు హాయ్ అని చాట్ చేయగానే హాయ్ టీజీ ఎన్‌పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం అని వస్తుందన్నారు. అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అనే మెసేజ్ వస్తుందన్నారు. రిజిస్టర్ కంప్లయింట్‌పై క్లిక్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, వితవుట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెనూ అని వస్తుందని తెలిపారు.

విత్ యూనిక్ సర్వీస్ నంబర్‌ను సెలక్ట్ చేసి నంబర్‌ను ఎంటర్ చేయగానే సర్వీస్ వివరాలు వస్తాయన్నారు. వివరాలను ఎంటర్ చేసి ఓకే చేయగానే కంప్లయింట్‌కు సంబంధించిన వివరాలు మెనూలో కనపడుతాయని తెలిపారు. అందులో కంప్లయింట్‌కు సంబంధించి సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. తర్వాత ఏజెంట్‌తో చాట్ చేయవచ్చు లేదా కంప్లయింట్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కంప్లయింట్ ఐడీతో ఒక నంబర్ జెనరేట్ అయ్యి ఫిర్యాదు నమోదవుతుందని తెలిపారు. అనంతరం చర్యల కోసం సంబంధిత అధికారికి కంప్లయింట్ వెళుతుందని, ఈ విషయం వినియోగదారుడి మెసేజ్ వెళ్తుందని తెలిపారు. భవిష్యత్తులో కంప్లయింట్ ఐడీతో వినియోగదారుడి సమస్యను ట్రాక్ చేసుకోవచ్చని తెలిపారు. కంప్లయింట్ పూర్తైన తర్వాత వినియోగదారుడికి సమాచారంతోపాటు ఐవీఆర్ఎస్ ద్వారా కాల్ వెళ్తుందన్నారు.

సమస్య పరిష్కరించిన తర్వాత ఫీడ్ బ్యాక్ ఇవ్వమని అడుగుతుంది లేదా సంతృప్తి చెందకపోతే మళ్లీ కంప్లైంట్ రీఓపెన్ చేయమని అడుగుతుందని తెలిపారు. www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో వాట్సాప్ ఐకాన్ కనిపి స్తుందని, ఆ ఐకాన్ క్లిక్ చేసి చాట్ చేయ వచ్చని తెలిపారు. వినియోగదారుడికి ఉత్తమసేవలు అందించడంలో భాగంగా సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి వాట్సాప్ చాట్‌బాట్ ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందాలని సూచించారు.



అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పద్మకు అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తంగళ్లపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ దర్శనాల రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 2024-25 సంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. అందుకుగాను బుధవారం హైదరాబాదులోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్‌తో పాటు ఐదు లక్షల క్యాష్ అవార్డును కళాశాల ప్రిన్సిపాల్ పద్మ అందుకున్నారు. అలాగే కళాశాలలో ఇంటర్మీడి యట్ ద్వితీయ సంవత్సరంలో స్టేట్ రెండో ర్యాంకు సాధించిన నందినికి రూ10 వేల క్యాష్ అవార్డు అందజేశారు.

సమగ్ర విద్యకు ప్రభుత్వం కృషి

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర విద్యాకోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సంజీవయ్య సంక్షేమ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సీఎం రేంత్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలు అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 268 ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ విద్యాసంస్థల ద్వారా దాదాపు 1.7 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం సామాజిక న్యాయ దిశగా ముందడుగన్నారు.



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

రాజన్న ఆలయ 13 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు

వేములవాడ కల్చరల్ మే 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి హుండీ లెక్కింపును బుధవారం చేపట్టారు. ఆలయ 13 రోజుల హుండీని ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య లెక్కించగా కోటి 44లక్షల 25వేల 31 రూపా యల నగదు, 107 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 7 కిలోల 900 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. కార్యనిర్వహణాధికారి వినోద్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ పరిశీలకుడు సత్యనారాయణ, ఏఈవోలు ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుండీ కౌంటింగ్‌లో శ్రీశివరామకృష్ణ భజన మండలి వారు పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న చెక్‌డ్యాంలు

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కొడిమ్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కొడిమ్యాల పెద్ద వాగు పారుతూ పూడూర్ గ్రామ శివారులోని ఐదు చెక్‌డ్యాంలు బుధవారం నుంచి మత్తడి దూకుతున్నాయి. దీంతో సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యాంల నీటితో ఈ రోహిణి కార్తీలో పత్తి, మొక్కజొన్న, కంది, పెసళ్లు, పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకోవటానికి అనుకూలంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. పూడూర్ గ్రామ శివారులో అకాల వర్షం నీటితో నిండిన చెక్‌డ్యాంలను బుధవారం సిరిసిల్లలోని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సందర్శించారు.



మత్తడి దూకుతున్న కొడిమ్యాల పెద్ద వాగు

● న్యూస్‌బాక్స్

మహిళల భద్రతే షీటీం లక్ష్యం

గణేశ్‌నగర్, మే28 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతే షీటీం లక్ష్యమని షీ టీం అధికారి, సీఐ శ్రీలత అన్నారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో బ్యూటీషియన్ కోర్సు విద్యార్థినులకు బుధవారం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, షీటీం భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, మహిళలపై అరాచకాలు తదితర సంఘటనలపై నిర్భయంగా షీటీంను సంప్రదించాలని తెలిపారు. ఆపద సమయంలో షీ టీం వాట్సాప్ నంబరు 8712670759లో సమాచారం ఇవ్వాలని, విద్యార్థినులు, మహిళల వద్ద నంబరు ఉండాలని అన్నారు. ఆపద సంభవించినప్పుడు ఈ వాట్సాప్ నంబరును విని యోగించాలన్నారు. అభద్రత భావం, అసౌకర్యం కలిగినప్పుడు కలిగినప్పుడు వెంటనే 100 నంబరకు డయల్ చేయాలని సూచించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూనిసెఫ్ ఆధ్వర్యంలో మహిళా గ్రామ సభలు

కరీంనగర్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్ మండలంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో మహిళా గ్రామ సభలు నిర్వహించారు. చెర్లబూత్కూర్ సభలో ఎంపీడీవో సంజీవరావు, చామనపల్లి, బహదూర్‌ఖాన్‌పేటలో ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీకార్యదర్శులు మహేందర్, వెంకటేశ్వర్ రావు, మహేందర్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

కరీంనగర్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి చొప్పదండి మార్గంలో వల్లంపహాడ్ బ్రిడ్జి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారిందని, వెంటనే మరమ్మతు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆర్‌అండ్‌బీ ఈఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలతో బిజీగా ఉండే రోడ్డులో గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అనాథ పిల్లల ఆకలి తీర్చడం అభినందనీయం

కరీంనగర్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లల ఆకలి తీర్చేందుకు మలబార్ గోల్డ్ సంస్థ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం మలబార్ గోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజు అనాథ పిల్లలకు అన్నదాన క్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది సీఎస్‌ఆర్ కింద కార్యక్రమాలు చేపడుతున్నా మలబార్ గోల్డ్ సంస్థ అనాథ పిల్లల ఆకలి తీర్చేందుకు చేపట్టిన కార్యక్రమం చాలా ఉదారమైనదన్నారు. ప్రతీరోజు 70 వేల మంది అనాథలకు అన్నదానం చేసేందుకు తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు.

పెట్టుబడిసాయం అందేనా?



ట్రాక్టర్‌తో నారుమడి దున్నుతున్న రైతు

- యాసంగిలో మూడెకరాలలోపే రైతు భరోసా
- ఎదురు చూస్తున్న అన్నదాతలు
- వానాకాలం సాగు ప్రారంభం

కరీంనగర్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ ముగిసినా రైతు భరోసా డబ్బులు పూర్తిస్థాయిలో అందలేదు. కరీంనగర్ మండలంలో యాసంగిలో కేవలం మూడెకరాల్లోపు రైతులకు మాత్రమే రైతు భరోసా డబ్బులను ప్రభుత్వం విడుదల చేసింది. మిగతా రైతులకు మంజూరు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ధరణి పోర్టల్‌లో నమోదై ఉన్న వ్యవసాయ భూములకు మాత్రమే ప్రతీ సీజన్‌లో ఎకరానికి 5వేల చొప్పున రైతు బంధు కింద పెట్టుబడి సాయం మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా సాగు చేసే భూములకే రైతు భరోసా అందిస్తామని చెప్పి, ఇళ్ల స్థలాలు, గుట్టలు, సాగు చేయని భూములు, ప్లాట్లు, ఇటుక బట్టీల పెట్టిన స్థలాలను తొలగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వానా కాలం సీజన్ నుంచి రైతు భరోసా అమలు చేస్తామని ప్రకటించినా 2లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేసింది, యాసంగి సీజన్‌లో సాగు భూములకు మాత్రమే రైతు భరోసా అమలు చేస్తామని, ఎకరానాకి 6వేల రూపాయల చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. ముందుగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన బహదూర్‌ఖాన్ పేట గ్రామంలోని 1,140 మంది రైతులకు జనవరి 26వ తేదీన రైతు భరోసా నిధులు కోటి 17లక్షల 33వేల రూపాయలను మంజూరు చేశారు. అనంతరం ఫిబ్రవరి 5 నుంచి మిగతా గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో జమ చేశారు. కేవలం మూడెకరాల వరకే సాయం మంజూరవగా ఎక్కువ భూమి ఉన్న రైతులకు ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. మండలంలో మొత్తం 11,016 మందికి 9కోట్ల 41 లక్షల 33 వేల 161 రూపాయలు డబ్బులు మంజూరు చేయాల్సిన నిధులకు మూడెకరాల రైతులు 9,974 మంది ఉన్నారు. వారికి 6కోట్ల 91లక్షల 73వేల 321 రూపాయలు జమ చేసింది. ఇంకా 1,042 మంది రైతులకు 2 కోట్ల 49లక్షల 59వేల, 840 రూపాయలు మంజూరు చేయాల్సి ఉంది. పోయిన సీజన్‌లో మిగిలిన రైతులతో పాటు వానాకాలం సీజన్ రైతు భరోసా డబ్బులను వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

డీఈవో జనార్దన్‌రావు సరెండర్ హర్షణీయం

కరీంనగర్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): అనుచిత వ్యాఖ్యలతో ఉపాధ్యాయ లోకాన్ని వేదకు గురిచేసిన డీఈవో జనార్దన్‌రావును కలెక్టర్ సరెండర్ చేయడం హర్షణీయమని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి తెలిపారు. బుధవారం డీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డీఈవో ఐదేళ్లుగా తన భాష ద్వారా ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురి చేశారని మండిపడ్డారు. తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రాంమోహన్, రాష్ట్ర పూర్వ అధ్య క్షులు రఘు శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ఆడిట్ కమిటీ కన్వీనర్ శంకర్ పాల్గొన్నారు.

జనార్దన్‌రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

ఉపాధ్యాయుల శిక్షణలో డీఈవో జనార్దన్‌రావు అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలను టీపీటీఎఫ్ ఒక ప్రకటనలో ఖండించింది. ఆయనను సరెండర్ చేస్తూ డైట్ ప్రిన్సిపాల్ మొండయ్యను డీఈవోగా నియమించడంపై టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంకె రామచంద్రారెడ్డి, వేల్పుల బాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్స్ అర్కాల శ్రీనివాస్, కోట రామస్వామి, రాష్ట్ర కమిటీ కిమటీ మెంబర్ జానకీదేవి హర్షం వ్యక్తం చేశారు.

అవినీతి మచ్చలేని నాయకుడు జువ్వాడి చొక్కారావు



నివాళులర్పిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): అవినీతి మచ్చ లేని నాయకుడు జువ్వాడి చొక్కారావు అని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి అన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు వర్ధంతి సందర్భంగా బుధవారం డీసీసీ కార్యాలయంతోపాటు వన్ టౌన్ చౌరస్తాలోని చొక్కారావు విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చొక్కారావు తెలంగాణ తొలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, మూడుసార్లు ఎంపీగా, ఉమ్మడి రాష్ట్రంలో పలు కీలక మంత్రి పదవులు చేపట్టారని, అటు ప్రజలకు ఇటు కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించారని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు కర్ర రాజశేఖర్, ముల్కల ప్రవీణ్, సుంకరి గణపతి, వంగల విద్యాసాగర్, ఎలగందుల మల్లేశం, నెల్లి నరేష్, నాగుల సతీష్, వెన్నం రజిత రెడ్డి, గంగుల దిలీప్, మాదాసు శ్రీనివాస్, కుర్ర పోచయ్య, పడిశెట్టి భూమయ్య, మహేష్, శ్రీరాముల రమేష్, తోట అంజయ్య, పర్వత మల్లేశం పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కరీంనగర్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 102వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని మానేరు బ్రిడ్జి వద్ద, టీడీపీ కార్యాలయంలో విగ్రహానికి పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం, పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షుడు సందబోయిన రాజేశం మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను భారతరత్న అవార్డుతో గౌరవించాలన్నారు. నాయకులు ఎర్రవెల్లి రవీందర్, పార్లమెంట్ మాజీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బసాలత్ ఖాన్, మాజీ బీసీ సెల్ కార్యదర్శి ఇట్ట మల్లేశం, మాజీ వాణిజ్య సెల్ అధ్యక్షుడు ఎలిమిల్ల కిషన్ పాల్గొన్నారు.

నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడిరామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్డి జేఏసీ ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంది తిరుపతిరెడ్డి, నాయకులు పొల్సాని దేవేందర్‌రావు, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించాలని ఎన్టీఆర్ యువజన సంఘాల మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఆల్‌ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టీరెడ్డి కరుణాకర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

హుజూరాబాద్/రామడుగు : హుజూరాబాద్, రామడుగులలో టీడీపీ ఆధ్వర్యంలో మాజీముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. హుజూరాబాద్‌లో ఎస్కే ఫయాజ్, వర్థినేని లింగారావు, రామగిరి అంకూస్, ప్రతాప రాజు, శివ, రామడుగులో పార్టీ నాయకులు పూరెళ్ల మనోజ్ కుమార్ గౌడ్, అనుపురం శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

సుభాష్‌నగర్ మే 28(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు రాపోలు జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని పద్మశాలి సంక్షేమ సంఘం ట్రస్టు భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో బాపూజీ కీలక పాత్ర పోషించారన్నారు. తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో పాలొన్నట్లు చెప్పారు. 87 ఏళ్ల వయస్సులో తెలంగాణ తొలిదశ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆయన సేవలను గుర్తించి తెలంగాణ అవతరణ దినోత్సం(జూన్ 2న) రోజున తెలంగాణ జాతిపితగా గుర్తించాలని, భారతరత్న కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించాలని కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణహరి, కోశాదికారి అల్లె భద్రయ్య, పోపా జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, జెల్ల నరేందర్, రవికుమార్, అనుమల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగు ప్రణాళిక సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మార్కెట్‌కు తరలిస్తారు. అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది.

● మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి బీటీ-3 విత్తనాలు

పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి బీటీ-3 పత్తి విత్తనాలు తీసుకువచ్చి ప్రతి యేటా విక్రయిస్తున్నారు. వెయ్యి రూపాయలకు కిలో విత్తనాలను విక్రయిస్తున్నారు. విత్తనాలను విక్రయించేవారు నేరుగా గ్రామాలకు వచ్చి రైతులను కలిసి విత్తనాలను, కలుపు మందయిన గ్లైపోసెట్‌ను అమ్ముతున్నారు. పురుగుల మందు షాపుల్లో కూడా ప్రభుత్వం నిషేధించిన గ్లైపోసెట్ మందును గుట్టు చప్పుడు కాకుండా విక్రయించడం ప్రతియేటా జరుగుతున్నది. ఈ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటున్నా రైతులు వాటి సాగుపై మొగ్గు చూపడంతో బీటీ-3 పత్తి సాగు యథేచ్ఛగా సాగుతున్నది.

డీఈవో వ్యాఖ్యలపై కలెక్టర్ సీరియస్

(5వ పేజీ తరువాయి)

డీఈవో వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో డీఈవో మాట్లాడుతూ తాను ఎవరినీ కించపరచాలని అనుకోలేదని, మనకు వచ్చిన పని చేయకపోతే సమాజానికి రాంగ్ మెస్సేజ్ ఇచ్చినట్లు అవుతుందనే ఉద్దేశంతో అలా మాట్లాడానని అన్నారు.

● పెళ్లాం.. మొగుళ్లు ఇష్టముండే ఫొటో దిగుతారా..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా వ్యవహరిస్తున్న జనార్దన్‌రావు అక్కడా అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల నిర్వహించిన భాషోపాధ్యాయుల సమావేశంలో తనతో ఫోటో దిగడానికి వచ్చిన సెక్టోరియల్ ఆఫీసర్‌తో అనుచితంగా వ్యవహరించారు. మీటింగ్ ముగిసే సమయానికి సదరు ఆఫీసర్ ఫోటో దిగేందుకు రాగా ఒక్కటి కాకపోతే 10 దిగండి.. అందరు తీసుకుంటున్నారు. అది మనం పెట్టుకోవడానికి ఉంటది, ఇష్టమున్నా.. లేకున్నా.. అని వ్యంగంగా మాట్లాడారు. దీంతో సదరు సెక్టోరియల్ ఆఫీసర్ అలా ఎలా మాట్లాడుతారని అనడంతో పెళ్లాంమొగలు ఇష్టముండే ఫొటో దిగుతారా అని అసందర్భ వ్యాఖ్యలు చేశారు. దీంతో పెయిర్స్ వేరు...ఎంప్లాయిస్ వేరు ఆమె అనడంతో వెంటనే తప్పును గ్రహించిన ఆయన నాకు మీరు చెల్లెలితో సమానం అంటూ కవర్ చేసుకున్నారు.

● నాకు రెండు సంసారాలు

ఇదే సమావేశంలో డీఈవో మాట్లాడుతూ రెండు సంసారాలు ఉన్నాయి నాకు. ఒక సంసారం ఈదడమే కష్టమైతది. కానీ రెండు సంసారాలు ఈదడం ఎంత కష్టమంటే అనుభవించిన వాడికే తెలుస్తుంది అని అన్నాడు.

తెలంగాణ ప్రజల హక్కుల కోసం టీఆర్‌ఎస్(డీ) ఏర్పాటు

సుభాష్‌నగర్ మే 28(ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సమితి డెమాక్రటిక్ ఏర్పడిందని వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ తెలిపారు. బుధవారం నగరంలోని ఫంక్షన్ హాలులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఆకాంక్షల కోసం ఏర్పడిన టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా మారిందని, తెలంగాణ ప్రజల పక్షాన ఒక పార్టీ ఉండాలని తెలంగాణ రక్షణ సమితి(డి) ఏర్పాటు చేశామన్నారు.

కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చిగుర్ల రాజు

కరీంనగర్ అసెంబ్లీ స్థానానికి తమ పార్టీ నుంచి చిగుర్ల రాజు పోటీ చేస్తారని ప్రటించారు. రాజును రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా మారేళ్ల శంకర్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోలే శ్రీనివాస్, కరీంనగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా పెట్టెం సుధాకర్ పేర్లను ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి నేరెళ్ల జైపాల్‌గౌడ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి చింతల భరత్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వాసంపల్లి ఆనంద్‌బాబు, రాష్ట్ర కోశాధికారి కొత్తూరు శంకర్, మహిళ అధ్యక్షురాలు తోడేటి స్వరూప, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గుంటుక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'హలో మాదిగ.. చలో వరంగల్'ను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, మే 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 31న తలపెట్టిన'హలో మాదిగ.. చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంద కృష్ణమాదిగ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకొని ఈనెల 31న వరంగల్ వస్తున్నారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దశాబ్ది వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీణవంక, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలలో 11వ అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాలు 27నుంచి జూన్21వరకు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఒకే భూమి ఒకే ఆరోగ్యం కోసం యోగా కార్యక్రమలు చేపడుతున్నాట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ ప్రాజెక్ట్‌మేనేజర్ ప్రవీణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్‌లు సంధ్యారాణి, వతున, తేజస్విని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వీణవంక, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ముదిరాజు కులస్థులు బుధవారం పెద్దమ్మతల్లి, పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలోని పుర వీధులగుండా డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీచైతన్య అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కల్‌సైన్స్ కళాశాలలో ఇంజనీరింగ్(ఈఈఈ) విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న పి బాలకిషన్‌కు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బాలకిషన్‌ను చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రాజు, అధ్యాపకులు అభినందించారు.

స్వరనీరాజనం కరపత్రం విడుదల

సైదాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని అంబేద్కర్ కూడలివద్ద నేడు నిర్వహించే బహుజన పితామహులకు స్వరనీరాజనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రంను బుధవారం మండలకేంద్రంలో నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ పొడిశెట్టి వెంకట్ రాజం, తిరుపతి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువ గట్టుపై చెత్తా చెదారం

- దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకోని అధికారులు



గట్టుదుద్దెనపల్లిలోని ఎస్సారెస్పీ కాలువ గట్టుపై చెత్తా చెదారం

మానకొండూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాలువగట్టుపై పంచాయతీ సిబ్బంది చెత్తాచెదారాన్ని వేస్తుండడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తా, చెదారాన్ని వేసేందుకు అప్పటిప్రభుత్వం లక్షలు వెచ్చించి గట్టుదుద్దెనపల్లి-పోలంపల్లి రహదారి పక్కన డంపింగ్ యార్డులను నిర్మించింది. అక్కడ వేయాల్సిన చెత్తాచెదారాన్ని ఎస్సారెస్పీ ప్రధానకాలువ గట్టుపై వేస్తుండడంతో కాలువతోపాటు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో చేరుతోంది. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనేఉన్న పిల్లల పార్కులోకి సైతం పేపర్లు, కవర్లు కొట్టుకువస్తున్నాయని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రతినిత్యం ఈ తతంగం జరుగుతున్నా పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి పర్యవేక్షణ చేయకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను వేయడానికి డంపింగ్‌యార్డు, చెత్తను తీసుకపోవడానికి ట్రాక్టర్ ఉన్నప్పటికీ కాలువగట్టుపై పోయడంలో ఆంతర్యం ఏమిటోనని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

● చెత్తాచెదారాన్ని తొలగిస్తాం..

- సమ్మయ్య గ్రామ ప్రత్యేకాధికారి

ఎస్సారెస్పీ ప్రధానకాలువపై చెత్తా, చెదారాన్ని అక్కడి చుట్టుపక్కల వారే పోస్తున్నారు. గతంలో కూడా అక్కడ పోసిన చెత్తను కాలపెట్టినం. మాకు డంపింగ్‌యార్డు, ట్రాక్టర్ ఉంది. గ్రామకార్యదర్శితో చెప్పి అక్కడి చెత్తను తొలగిస్తాం.

చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మట్లాడుతున్న అరుణ్‌కుమార్

సైదాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగిఉండాలని హుజూరాబాద్‌కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వెన్నంపల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీఎస్సైభార్గవ్, లోక్‌అదాలత్ సభ్యులు అందె వెంకటేశ్వర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కిషోర బాలికలకు పరిశుభ్రతపై అవగాహన

మానకొండూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామంలో బుధవారం ఋతుక్రమ పరిశుభ్ర దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో వెల్ది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వెంకటేశ్ కిషోర బాలికలు, మహిళలు ప్రతినెల జరిగే ఋతుక్రమంలో పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. బెల్లం, ఆకుకూరలు, ఖర్జూరం, కాల్షియం ఉండే పాలు, పెరుగు, గ్రుడ్లు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

చొప్పదండి సీఐగా ప్రదీప్‌కుమార్

చొప్పదండి, మే 28 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి సీఐగా ప్రదీప్‌కుమార్ బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ ప్రకాశ్‌గౌడ్ బదిలీ అయ్యారు. సీఐ ప్రదీప్‌కుమార్‌ను ఎస్సైసురేందర్ పుష్పగుచ్చం అందజేశారు.

పేదవాడి చిరకాల స్వప్నం ఇందిరమ్మ ఇల్లు: ఎమ్మెల్యే సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, మే 28 (ఆంధ్రజ్యోతి): పేదవాడి చిరకాల స్వప్నమైన ఇందిరమ్మ ఇళ్లను అందించడమే ప్రభుత్వధ్యేయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని అన్నిగ్రామాల్లోని 737మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అధికారులతోకలిసి ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో గూడులేని పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత మాదేనని అన్నారు. రాబోవు స్థానికసంస్థల్లో కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో, ప్యాక్స్ వీఎంకే రెడ్డి మండల ప్రత్యేక అధికారి అనిల్‌ప్రకాశ్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు: ఎక్సైజ్ సీఐ





మద్యం షాపులోని రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

హుజూరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఎక్సైజ్‌సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణం లోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రిజిస్టర్లు అప్‌డేట్‌లేని షాపులపై టెక్నికల్ కేసులు నమోదు చేశారు. మండలంలోని బెల్ట్‌షాపులను సైతం తనిఖీ చేశారు. బోర్నపల్లి గ్రామంలోని కేశినేని శ్రీనివాస్, కనుకులగిద్దె గ్రామానికి చెందిన అనూరి ఇజ్జగిరి అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ, మల్లాపూర్ గ్రామంలోని రైతువేదికల్లో బుధవారం కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం వారి ఆధ్వర్యంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి శ్రావణి, పి మధుకర్‌రావు మాట్లాడుతూ రైతులందరూ యూరియా వాడకాన్ని తగ్గించి, సాగు ఖర్చుని తగ్గించుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి జీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పంట మార్పిడి చేస్తూ అధిక దిగుబడి సాధించాలని తెలిపారు.

ఊటూర్ సింగిల్‌విండో అధ్యక్షుడిగా ప్రదీప్‌రెడ్డి

మానకొండూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ సహకార సంఘం అధ్యక్షుడిగా ముద్దసాని ప్రదీప్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల గట్టుదుద్దెనపల్లి, ఊటూర్ సొసైటీల పాలకవర్గాన్ని రద్దుచేసిన విషయం తెలిసిందే. కాగా సదరు పాలకవర్గ సభ్యులు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు ప్రదీప్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

ఆర్థిక సహాయం అందజేత

గంగాధర, మే 28 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కాచిరెడ్డిపల్లికి చెందిన బాధిత రైతుకు సమాజసేవకుడు తూడి లచ్చయ్య ఆర్థికసహాయం అందించారు. ఇటీవల పిడుగుపాటుకు గ్రామానికిచెందిన వీర మల్లయ్య రెండు పశువులు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న లచ్చయ్య బాధిత రైతును పరార్శించి 10 వేల ఆర్థిక సహాయం అందించారు.

సురవరం ప్రతాపరెడ్డి జయంతి

శంకరపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువును పొడిగించాలి

రామడుగు, మే 28 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్‌కార్డు దరఖాస్తుల గడువును పొడిగించాలని బీజేపీ రామడుగు మండల శాఖ అధ్యక్షుడు మోడీ రవీందర్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రం ఏర్పడిన గత ప్రభుత్వం ఏ ఒక్కరికి కూడా నూతన రేషన్‌కార్డు మంజూరు చేయలేదని, ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దిరోజులు మాత్రమే సమయం ఇచ్చి లబ్ధిదారులను ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అందుబాటులో విత్తనాలు

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరండ్ల పీఏసీఎస్ సొసైటీలో పచ్చిరొట్ట, ఎరువులు, జీవుగ విత్తనాలు 50శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, జిరాక్స్‌లు, ఫోన్ నంబర్ తీసుకొని రావాలని తెలిపారు.